సంపుటి : 9
సంచిక : 304
సోమవారం
27 జూలై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

10 YEARS CELEBRATING

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE

విశ్వవాయిస్
వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!
ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!
వెంటనే స్కాన్ చేయండి!
ఇప్పుడే చదవండి!

Contact For Ads:
7579339999

బంగాళాఖాతంలో

## వాయుగుండం



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : వాయవ్య బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. సోమవారం పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర తీరం వెంబడి గంటకు 55-65 కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే మిగతా .. 2లో..

తెలుగు భాష పరిణామక్రమంపై

## డాక్యుమెంటేషన్

మంత్రి కందుల దుర్గేష్




అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగు భాషా పరిరక్షణ, సాంస్కృతిక వైభవ పునరుద్ధరణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఉండవల్లి గుహల వద్ద రెండు రోజుల పాటు నిర్వహించిన 'తెలుగు మహోత్సవం' వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో మంత్రి దుర్గేశ్ మాట్లాడారు. మాతృభాషలోనే ప్రాథమిక విద్యా బోధన ఉండాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. పత్రికారంగానికి మిగతా .. 2లో..

జలదిగ్బంధంలో

## గండిపోశమ్మ ఆలయం



దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. గోదావరికి ఎగువ నుంచి వస్తున్న వరదతో ఆదివారం ఉదయానికి ఆలయంలో భారీగా నీరు చేరింది. అమ్మవారి అంతరాలయంలో విగ్రహం మెడ వరకూ వరద చేరడంతో అర్చకులు అప్రమత్తమయ్యారు. ఆలయ మండపం, భక్తుల క్యూలైన్లలోకి మిగతా .. 2లో..




ఒకే వేదికపై


# బొండా ఉమ, అంబటి రాంబాబు... చంద్రబాబు కీలక నిర్ణయం!




అంబటి రాంబాబుతో వేదిక పంచుకున్న బొండా ఉమ

**కీలక నిర్ణయాలు**

- బొండా ఉమ నుంచి వివరణ తీసుకోవాలి
- వివరణ స్వీకరించే బాధ్యత పల్లా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడుకు అప్పగింత
- వైసీపీ నేతలతో వేదిక పంచుకోవద్దని నేతలకు స్పష్టమైన ఆదేశం



"వైసీపీని 'గొడ్డలి పార్టీ'... 'విషవృక్షం'... ఆ పార్టీ పన్నే ఉచ్చులో ఎవరూ పడొద్దు. వైసీపీ నేతలతో వేదిక పంచుకోవద్దు. ఇది ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

- చంద్రబాబు

గుంటూరు, విశ్వం వాయిస్ న్యూస్ : తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమా మహేశ్వరరావు వ్యవహారంపై ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధినేత చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుతో కలిసి వేదిక పంచుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బొండా ఉమ నుంచి తక్షణమే సంజాయిషీ తీసుకోవాలని చంద్రబాబు మిగతా .. 2లో..

**తీవ్రంగా స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

- కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి ప్రజలను విడదీయడమే వైసీపీ ఎజెండా
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలి
- అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రజలకు అందుబాటులో ఉండాలి

అధినేత స్పష్టమైన సందేశం

**ఈ తరహా విషయాల్లో ఇకపై ఉపేక్షించేది లేదు!**

కేంద్ర నూతన విద్యాశాఖ మంత్రిగా

## బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా
విద్యార్థి సంఘాలతో కేంద్ర మంత్రుల చర్చలు సఫలం కావడంతో ఆందోళనల విరమణ
తనపై నమ్మకం ఉంచిన ప్రధానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రహ్లాద్ జోషి



తెలంగాణా, విశ్వం వాయిస్ న్యూస్ : కేంద్ర విద్యాశాఖ నూతన మంత్రిగా సీనియర్ నేత ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో, 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా, తాను ప్రధాని నరేంద్ర మోదీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా నిన్న ప్రకటించారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ కీలక శాఖను అప్పగించారు. నేడు బాధ్యతలు స్వీకరించిన అనంతరం మిగతా .. 2లో..

సామాన్యులను

## కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్



విశ్వం వాయిస్ న్యూస్ : ఆదాయపు పన్ను శాఖ అధికారులు సామాన్యుల ప్రయోజనాల కోసం పని చేయాలని, ప్రతి చిన్న పనికి వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ హితబోధ చేశారు. అధికారులు తమ విధుల్లో పూర్తి సామర్థ్యంతో, నిజాయతీగా పనిచేయాలని సూచించారు. అదే సమయంలో మిగతా .. 2లో..

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా

## అమరవీరులకు నివాళులు

సైనికుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమన్న సీఎం చంద్రబాబు
కార్గిల్ విజయం భారత స్ఫూర్తికి ప్రతీక అన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు ప్రాణత్యాగం చేసిన సైనికుల అసమాన ధైర్యసాహసాలను, త్యాగాలను వారు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ మేరకు ఇరువురు నేతలు సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా తమ సందేశాలను మిగతా .. 2లో..

## మాజీ మంత్రి రోజాకు పోలీసు నోటీసులు

రాజకీయ కక్షసాధింపుతోనే తనపై అక్రమ కేసులు పెట్టారన్న రోజా
'రెడ్ బుక్ రాజ్యాంగం' అమలు చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శ
విచారణకు ఈ నెల 30న హాజరుకావాలని ఆదేశం



విశ్వం వాయిస్ న్యూస్ : వైసీపీ మహిళా నేత, మాజీ మంత్రి రోజాకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఓ పత్రిక ప్రతులను దహనం చేసిన కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా నగరిలోని ఆమె నివాసానికి వెళ్లిన తిరుపతి ఈస్ట్ పోలీసులు, ఈ నెల 30న విచారణకు రావాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. కొన్ని రోజుల క్రితం, తమ పార్టీ నాయకుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఓ దినపత్రికలో అసత్య కథనాలు ప్రచురించారని ఆరోపిస్తూ రోజా నిరసన తెలిపారు. అందులో భాగంగా పత్రిక ప్రతులను మిగతా .. 2లో..

హర్మ్యూజ్‌లో 'రుసుము'పై

## ఇరాన్, ఒమన్ చర్చలు



టెహ్రాన్, విశ్వం వాయిస్ న్యూస్ : హర్మ్యూజ్ జలసంధి నిర్వహణ విషయంలో ఒమన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతున్నట్లు ఇరాన్ విదేశాంగశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ తెలిపారు. రెండు రోజులపాటు ఇరుదేశాల డిప్యూటీ విదేశాంగశాఖ మంత్రులు టెహ్రాన్‌లో దీనిపై విస్తృత చర్చలు జరిపినట్లు ఆయన వెల్లడించారు. ఇరుదేశాల సార్వభౌమాధికారానికి నష్టం వాటిల్లకుండా, వాణిజ్య నౌకల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై ఇరు దేశాల నేతలు చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా సాంకేతిక, రాజకీయపరమైన అంశాలపై చర్చలు జరిగినట్లు తెలిపారు. అమెరికా దళాలు దాడులు నిలిపివేయడంతో ఒమన్‌తో చర్యలు పురోగమిస్తున్నాయని ఆయన అన్నారు. హర్మ్యూజ్ గుండా ప్రయాణించే నౌకలకు సేవా రుసుములు విధించడంపై చర్చిస్తామని ఒమన్, ఇరాన్ దేశాలు జూన్‌లోనే ప్రకటించాయి. అది అమెరికాకు రుచించలేదు. దీంతో ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందం కుదిరిన రోజుల మిగతా .. 2లో..

## ఉక్రెయిన్‌లో నౌకపై దాడి..

ఇద్దరు భారతీయుల గల్లంతు



విశ్వం వాయిస్ న్యూస్ : ఉక్రెయిన్‌కు చెందిన ఒడెసా పోర్టు వద్ద భారతీయ నావికులున్న వాణిజ్య నౌకపై దాడి జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు సురక్షితంగా బయటపడగా, మరో ఇద్దరి జాడ తెలియరాలేదు. నల్ల సముద్రంలో ఒడెసా ఓడరేవు వద్ద 'ఎంవీ ఏజీఎన్ రాగ్నర్' మర్చంట్ నౌకపై శనివారం (జులై 25న) ఈ దాడి జరిగినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై ఉక్రెయిన్‌లోని భారతీయ రాయబార కార్యాలయం స్పందించింది. దాడి జరిగిన సమయంలో నౌకలో నలుగురు భారతీయులు ఉన్నట్లు వెల్లడించింది. ఇద్దరు మిగతా .. 2లో..

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు

## వైఎస్ షర్మిలకు శస్త్రచికిత్స



పొత్తికడుపుకు ఆపరేషన్ జరిగిందని స్వయంగా వెల్లడి
ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని 'ఎక్స్' వేదికగా పోస్ట్
ఆందోళన చెందవద్దని పార్టీ కార్యకర్తలు, అభిమానులకు సూచన
సర్జరీ కారణంగానే ఇటీవల రాజకీయ కార్యక్రమాలకు దూరం

విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రి బెడ్‌పై చికిత్స పొందుతున్న ఆమె ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ ఊహాగానాలకు తెరదించుతూ, తన ఆరోగ్య పరిస్థితిపై షర్మిల స్వయంగా 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పష్టత ఇచ్చారు. తనకు పొత్తికడుపుకు సంబంధించిన ఒక సాధారణ ఆపరేషన్ జరిగిందని, ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నానని తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక పోస్ట్ చేస్తూ.. "ఇటీవల నాకు పొత్తికడుపు ఆపరేషన్ మిగతా .. 2లో..

## విదేశీ ఉద్యోగాల పేరుతో చీటింగ్

విజయవాడ దంపతులపై హైదరాబాద్‌లో కేసు

హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ : విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించిన విజయవాడకు చెందిన దంపతులపై హైదరాబాద్‌లో కేసు నమోదైంది. సౌజన్య, శ్రీనివాస్ అనే ఈ జంట బేగంపేటలో 'ఫ్లయింగ్ బోర్డర్ కన్సల్టెన్సీ' పేరుతో సంస్థను నడుపుతూ ఈ మోసాలకు పాల్పడినట్లు పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం, ఈ దంపతులు విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి మిగతా .. 2లో..

ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్-2 విజేతగా

## టాలీవుడ్ థండర్స్



విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : వెండితెర, బుల్లితెర నటీనటులు పాల్గొన్న ఎలైట్ క్రికెట్ లీగ్ సీజన్-2 విజేతగా టాలీవుడ్ థండర్స్ జట్టు నిలిచింది. సిరి ఇన్ఫో మిస్సైల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం మిగతా .. 2లో..

తిరుమలలో

## కొనసాగుతున్న భక్తుల రద్దీ

సర్వదర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం



తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుమల శ్రీవారి క్షేత్రం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. క్యూలైన్లు బయటకు విస్తరించి శిలాతోరణం వరకు బారులు తీరిన పరిస్థితి నెలకొంది. ఆదివారం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# చంద్రబాబు కీలక నిర్ణయం!

కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయన నుంచి వివరణ స్వీకరించే బాధ్యతను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల గుంటూరులో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ జరిగింది. ఈ కార్యక్రమానికి బొండా ఉమ, అంబటి రాంబాబు హాజరయ్యారు. ఇద్దరూ ఒకే వేదికపై ఆశీనులవడమే కాకుండా, ఆప్యాయంగా మాట్లాడుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. నిత్యం చంద్రబాబును, టీడీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించే అంబటితో బొండా ఉమ వేదిక పంచుకోవడంపై సొంత పార్టీ శ్రేణుల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. ఈ పరిణామంపై పార్టీ నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో చంద్రబాబు తీవ్ర స్వరంతో స్పందించారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ' అని, 'విషవృక్షం' అని అభివర్ణించిన ఆయన, ఆ పార్టీతో ఎలాంటి సంబంధాలు పెట్టుకోవద్దని స్పష్టం చేశారు. "కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి, ప్రజలను విడదీయడమే వైసీపీ ఎజెండా. ఆ పార్టీ పన్నే ఉచ్చులో ఎవరూ పడొద్దు. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితుల్లోనూ వైసీపీ నేతలతో మన పార్టీ నాయకులు వేదిక పంచుకోకూడదు. ఈ విషయాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి" అని గట్టిగా హెచ్చరించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టి సారించాలని చంద్రబాబు నేతలకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని దిశానిర్దేశం చేశారు. గతంలోనూ కొందరు నేతలు వైసీపీ నేతలతో కనిపించడం పార్టీ కేడర్‌కు తప్పుడు సంకేతాలు పంపుతుందని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే బొండా ఉమ వ్యవహారంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. తాజా నిర్ణయంతో, ఈ తరహా విషయాల్లో ఉపేక్షించేది లేదని చంద్రబాబు పార్టీ శ్రేణులకు స్పష్టమైన సందేశం పంపినట్లయింది.

## బంగాళాఖాతంలో వాయుగుండం

అవకాశముందని వివరించింది. సముద్రం అలజడిగా ఉంటుందని.. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

## తెలుగు భాష పరిణామక్రమంపై డాక్యుమెంటేషన్

వన్నె తెచ్చిన రామోజీరావు తెలుగు భాషా వికాసానికి విశేష కృషి చేశారని కొనియాడారు. తెలుగు సంస్కృతికి, భాషాభివృద్ధికి కూటమి ప్రభుత్వ పాలన స్వర్ణయుగం లాంటిదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సరిచేస్తూ ప్రాథమిక విద్యలో తెలుగు తప్పనిసరి చేశామని మంత్రి పేర్కొన్నారు. "తమిళుల తరహాలో తెలుగు భాష పరిణామక్రమంపై సమగ్రంగా డాక్యుమెంటేషన్ రూపొందించాలని నిర్ణయించాం. తోలుబొమ్మలాట, హరికథ, పద్య నాటకం వంటి ప్రాచీన కళారూపాలను కాపాడుకుందాం. నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చేలా త్వరలోనే 'నంది నాటకోత్సవాలు' నిర్వహిస్తాం. ఆగస్టు 29న గిడుగు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడమే కాకుండా తెలుగు భాషా పురస్కారాలు అందిస్తాం" అని తెలిపారు.

## జలదిగ్బంధంలో గండిపోశమ్మ ఆలయం

భారీగా వరద నీరు చేరడంతో దర్శనాలను నిలిపివేశారు. ఆలయం వైపునకు భక్తులు వెళ్లకుండా కార్యనిర్వహణాధికారి జి.వి.లక్ష్మీకుమార్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. గోదావరిలో వరద తగ్గేవరకూ భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆలయం సమీపంలోని దుకాణాల్లోకి వరద నీరు చేరడంతో స్థానికులు ఖాళీ చేశారు. డి.రావిలంక-దండంగి గ్రామాల మధ్య ఆర్అండ్‌బీ రహదారిని వరద నీరు ముంచెత్తడంతో అమ్మవారి ఆలయానికి రాకపోకలు నిలిచాయి.

## బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. "కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ఈరోజు బాధ్యతలు స్వీకరించాను. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్టతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నాను" అని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి, ధార్వాడ్ లోక్‌సభ స్థానం నుంచి ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు.

## సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోకండి

ప్రభుత్వ శాఖల నిర్లక్ష్య వైఖరి పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ముంబయిలో కొత్త 'ఆయ్‌కార్ సింధు' భవనాన్ని నిర్మలా సీతారామన్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఐటీ అధికారులను ఉద్దేశించి ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆదాయపు పన్ను శాఖ ప్రభుత్వ ఏజెన్సీనే అయినప్పటికీ ఈ ప్రాజెక్ట్ అనుమతుల కోసం ఆ శాఖ పడిన ఇబ్బందికర పరిస్థితుల గురించి ఆమె గుర్తుచేశారు. ఒక ప్రభుత్వ సంస్థే ఇలా ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటే సామాన్యుల పరిస్థితి ఏంటని ఆమె ప్రశ్నించారు. సామాన్యులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని, వారి తరఫున అధికారులే చొరవ తీసుకోవాలని సూచించారు. అలాగని నిబంధనలను ఉల్లంఘించాలని చెప్పడం లేదన్నారు. వారు పొందాలనుకున్న సర్వీసులను జాప్యం లేకుండా అందించాలన్నారు. ఈ దేశంలో సామాన్యులు తమ న్యాయపరమైన హక్కులను పొందడానికి కష్టపడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అమరవీరులకు నివాళులు

పంచుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందిస్తూ.. "అసాధారణ ధైర్యసాహసాలతో దేశానికి ఘన విజయాన్ని అందించిన యోధులకు నివాళులు అర్పిస్తున్నాను. అత్యంత దుర్భేద్యమైన భూభాగం, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడారు. వారి అత్యున్నత త్యాగం, అసమాన పరాక్రమం తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఇది భారతీయ దేశభక్తికి, జాతీయ గర్వానికి శాశ్వత ప్రతీకగా మిగిలిపోతుంది" అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో పేర్కొంటూ.. "అసాధారణ శౌర్యంతో, నిస్వార్థ త్యాగంతో త్రివర్ణ పతాక గౌరవాన్ని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడిన అమరవీరులకు వినమ్ర నివాళులు. కార్గిల్ కేవలం ఒక యుద్ధ విజయం మాత్రమే కాదు.. అది అజేయమైన ధైర్యానికి, భారతదేశ అచంచల స్ఫూర్తికి నిదర్శనం. మన పవిత్ర మాతృభూమిలోని ప్రతి అంగుళాన్ని మన సైనిక యోధులు ప్రాణాలకు తెగించి తిరిగి స్వాధీనం చేసుకున్నారు. వారి త్యాగాల పునాదిపైనే మనం నేడు ప్రశాంతంగా జీవిస్తున్నాం" అని తెలిపారు.

## మాజీ మంత్రి రోజాకు పోలీసు నోటీసులు

దహనం చేశారు. ఈ ఘటనపై నమోదైన కేసులో భాగంగానే పోలీసులు తాజాగా నోటీసులు అందజేశారు.

**ఇది రాజకీయ కక్షసాధింపే: రోజా**

కూటమి ప్రభుత్వం తనపై రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, అందులో భాగంగానే అక్రమ కేసులు బనాయించిందని రోజా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పోలీసులు నోటీసులు అందజేసిన అనంతరం రోజా మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని పక్కనపెట్టి, కూటమి ప్రభుత్వం 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' అమలు చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ అధినేత జగన్ తో పాటు, పార్టీ నాయకుల కుటుంబాల్లోని మహిళలను కించపరిచేలా ఆంధ్రజ్యోతి పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురించారని, అందుకే నిరసనగా ఆ పత్రిక ప్రతులను దహనం చేశామని స్పష్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపితే కేసులు పెట్టడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని రోజా ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని, మహిళలకు, చిన్నారులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రతను గాలికి వదిలేసిన ప్రభుత్వం, కేవలం పేపర్లు దహనం చేసినందుకు తమకు నోటీసులు ఇవ్వడం పక్షపాత వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి, ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. ప్రభుత్వం చేసే తప్పులను, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే వారి గొంతు నొక్కేందుకే ఇలాంటి కక్షపూరిత కేసులు పెడుతున్నారని రోజా అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని గుర్తుచేశారు. ఇటువంటి బెదిరింపులకు, అక్రమ కేసులకు వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఎవరూ భయపడరని ఆమె తేల్చి చెప్పారు. తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమపై బనాయించిన అక్రమ కేసులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని రోజా డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం మంచి పద్ధతి కాదని హితవు పలికారు.

## హర్మూజ్‌లో 'రుసుము'పై ఇరాన్, ఒమన్ చర్చలు

వ్యవధిలోనే హర్మూజ్ కేంద్రంగా మరోసారి వివాదం మొదలైంది. హర్మూజ్‌పై పట్టు సాధించేందుకు అమెరికా మరోసారి దాడులు మొదలు పెట్టింది. యూఎస్ఏ చర్యలను ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటించింది. హర్మూజ్‌ను మూసివేసినట్లు ప్రకటించింది. తమ అనుమతి లేకుండా ఒక్క నౌకను కూడా హర్మూజ్ దాటనివ్వబోమని హెచ్చరించింది. దీంతో హర్మూజ్‌కు మరోవైపు ఉన్న ఒమన్ తీరం గుండా నౌకలు ప్రయాణించేలా అమెరికా ప్రోత్సహించింది. అందుకు ఒమన్ కూడా అంగీకరించింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఇరాన్.. బెదిరింపులకు దిగడంతో ఆ దేశం మిన్నకుండిపోయింది. గత కొన్ని రోజులుగా ఇరాన్‌పై అమెరికా దాడులు నిలిపివేయడంతో.. టెహ్రాన్, మస్కట్ మధ్య చర్చలు ఊపందుకున్నాయి.

## ఉక్రెయిన్‌లో నౌకపై దాడి..

గల్లంతయ్యారని, మరో ఇద్దరు సురక్షితంగా ఉన్నట్లు తెలిపింది. గల్లంతైన సిబ్బంది కోసం విస్తృత గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎంబసీ పేర్కొంది. ఇందుకోసం ఉక్రెయిన్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపింది.

## వైఎస్ షర్మిలకు శస్త్రచికిత్స

జరిగింది. ప్రస్తుతం నేను బాగున్నాను, చాలా వేగంగా కోలుకుంటున్నాను. ఈ విషయాన్ని మీ అందరితో పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సమయంలో నా కోసం ప్రార్థనలు చేసిన వారికి, ధైర్యం చెప్పిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు ఎంతో బలాన్నిచ్చాయి" అని పేర్కొన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి షర్మిల రాష్ట్ర రాజకీయాల్లో చాలా చురుగ్గా ఉంటున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలపై విమర్శలు చేస్తూ తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. అయితే, గత కొంతకాలంగా ఆమె ప్రత్యక్ష రాజకీయ కార్యక్రమాల్లో కనిపించకపోవడం చర్చనీయాంశమైంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా 'నీట్' పేపర్ లీక్ వ్యవహారంపై నిరసనలు జరుగుతున్న సమయంలో ఆమె గైర్హాజరుపై పలువురు ప్రశ్నించారు. అయితే, ఆ సమయంలో ఆమె ట్విట్టర్ ద్వారా స్పందిస్తూనే ఉన్నారు. తాజాగా ఆమెకు సర్జరీ జరగడమే ఈ విరామానికి కారణమని స్పష్టమైంది. షర్మిల ఏపీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన తర్వాత పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో జోష్ పెరిగిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆమె కోలుకుంటున్నారని, త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాక్షేత్రంలోకి, రాజకీయ కార్యక్రమాల్లోకి వస్తారని పార్టీ వర్గాలు, అభిమానులు ఆశిస్తున్నారు.

## విదేశీ ఉద్యోగాల పేరుతో చీటింగ్

రూ.14 లక్షల వరకు వసూలు చేశారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు ఇప్పించకపోగా, కట్టిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (జజూ) పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి మోసం వల్ల తెలంగాణ వ్యాప్తంగా సుమారు 2,000 మంది ప్రభావితమై ఉండొచ్చని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జంటపై గతవారమే విజయవాడలో ఇలాంటి మోసం కేసులోనే అరెస్ట్ అయ్యారని, బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ మోసాలు కొనసాగిస్తున్నారని బాధితులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీసీఎస్ పోలీసులు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 318 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తులో ఈ దంపతుల మోసం భారీ స్థాయిలో ఉన్నట్లు తేలింది. యూకే, అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాల్లో నైపుణ్యం ఉన్న, లేని ఉద్యోగాల పేరుతో దాదాపు 750 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.11.46 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. కొంతకాలం పరారీలో ఉన్న వీరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. వసూలు చేసిన డబ్బులో కొంత భాగాన్ని ఈ దంపతులు రియల్ ఎస్టేట్ రంగంలోకి మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. 2024-2026 మధ్య కంకిపాడులో రూ.1.42 కోట్ల విలువైన మూడు ప్లాట్లను కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, విదేశీ నియామకాలకు అవసరమైన విదేశాంగ శాఖ లైసెన్సు కూడా ఈ కన్సల్టెన్సీకి లేదని బాధితులు ముందునుంచే ఆరోపిస్తున్నారు. ఈ మోసం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా, డబ్బును ఇంకా ఎక్కడెక్కడ పెట్టుబడులు పెట్టారు అనే కోణంలో రెండు నగరాల పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు.

## టాలీవుడ్ థండర్స్

రాత్రి విశాఖలోని ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సిరి ఇన్ఫో మిస్ఫైల్స్ జట్టుపై టాలీవుడ్ థండర్స్ జట్టు 64 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన టాలీవుడ్ థండర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. నిఖిల్ సిద్ధార్థ (41), అశ్విన్ (40), ఓంకార్ (36), మనీష్ (35) రాణించారు. అనంతరం 197 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సిరి ఇన్ఫో మిస్ఫైల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 132 పరుగులకు పరిమితమైంది. త్రినాథ్ (57) అర్ధశతకంతో రాణించాడు. టాలీవుడ్ థండర్స్ బౌలర్లు ఖయ్యూం అలీ 3, అశ్విన్‌బాబు 2 వికెట్లు పడగొట్టారు. నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ విజేత జట్టుకు ట్రోఫీని అందజేశారు. విజయ్ దివస్ సందర్భంగా అమరజవాన్ల కుటుంబాలకు రూ.20 లక్షల చెక్కును సీపీ అందజేశారు.


## తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

కావడంతో రద్దీ మరింత పెరిగింది. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని సూచిస్తున్నారు. నిన్న శనివారం (జులై 25) ఒక్కరోజే 84,488 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 37,061 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తుల కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.78 కోట్లు వచ్చినట్టు టీటీడీ తెలిపింది. అదేవిధంగా, నిన్న 4.28 లక్షల లడ్డూలు విక్రయించగా, 2.74 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. వైద్య శిబిరాల్లో 3,789 మందికి చికిత్స అందించారు.

# బాలకృష్ణను పరామర్శించిన సీఎం చంద్రబాబు

**హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలకృష్ణ - బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడిన సీఎం**

**గత వారం షూటింగ్‌లో మోకాలికి గాయపడటంతో శస్త్రచికిత్స - ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపిన వైద్యులు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ పరామర్శించారు. గత వారం సినిమా షూటింగ్‌లో గాయపడిన బాలకృష్ణకు ఇటీవల మోకాలికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చంద్రబాబు.. తన బావమరిది అయిన బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన ఎంత వేగంగా కోలుకుంటున్నదీ వాకబు చేశారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడి బాలకృష్ణకు అందిస్తున్న చికిత్స, తదుపరి పునరావాస ప్రణాళికల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 21న రాజమండ్రిలో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఓ సినిమా షూటింగ్‌లో పాల్గొన్నప్పుడు బాలకృష్ణ ప్రమాదవశాత్తు గాయపడ్డారు. ఆయన ఎడమ మోకాలికి తీవ్ర గాయం కావడంతో మరుసటి రోజే ఆయన్ను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించి ఏఐజీ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్య పరీక్షల అనంతరం బాలకృష్ణ ఎడమ కాలి క్వాడ్రిసెప్స్ టెండన్ (తొడ కండరాన్ని మోకాలి చిప్పకు కలిపే కణజాలం) చిరిగిందని, మోకాలికి ఇరువైపులా ఉన్న సహాయక కణజాలాలు కూడా దెబ్బతిన్నాయని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఈ నెల 23న వైద్యులు ఆయనకు విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేశారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ ఆపరేషన్‌లో గాయం చుట్టూ పేరుకుపోయిన రక్తాన్ని తొలగించి, చిరిగిన టెండన్‌ను మోకాలి చిప్పకు తిరిగి అతికించామని, దెబ్బతిన్న కణజాలాలకు మరమ్మతులు చేశామని ఆసుపత్రి వర్గాలు మెడికల్ బులెటిన్‌లో తెలిపాయి. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణుల బృందం పర్యవేక్షణలో ఉన్నారని పేర్కొన్నాయి.

ప్రధాని మోదీ కీలక అప్‌డేట్..

# సంస్కరణల కోసం హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఓ వీడియో విడుదల చేశారు. "ఈ టాస్క్‌ఫోర్స్ పరీక్షల సంస్కరణలపై దృష్టి పెడుతుంది. కమిటీ నివేదిక ఆధారంగా విశ్వసనీయత దెబ్బతినకుండా భవిష్యత్‌లో పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ప్రశ్నపత్రం లీకేజీని అరికట్టేందుకు కఠినమైన చట్టం తీసుకొస్తున్నాం. దీనికి సంబంధించిన బిల్లును సోమవారం పార్లమెంట్‌లో ప్రవేశపెడతాం. విశ్వసనీయమైన, పారదర్శకమైన పరీక్ష విధానం అమలు చేస్తాం. పరీక్షల నిర్వహణలో అత్యున్నత టెక్నాలజీని అవలంబిస్తాం" అని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు.

**టాస్క్ ఫోర్స్ సభ్యులు వీళ్లే..**

నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా ఉంటారు. యస్. సోమనాథ్ (ఇస్రో మాజీ ఛైర్మన్), తపన్ డేకా (ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్), వి. కామకోటి (ఐఐటీ మద్రాస్ డైరెక్టర్), అనితా కర్వాల్ (కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి), అమృత్ లాల్ మీనా (లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు).



**ప్రధాన బాధ్యతలు**

ఎన్‌టీఏ పరీక్ష వ్యవస్థను పునర్‌వ్యవస్థీకరించడం

పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం

పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం

పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం

డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం

భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం.

## ఎడిటర్ వాయిస్

# ఎమ్మెల్యే బొండా సంచలన వ్యాఖ్యలు.. తిరుగుబాటుకు సంకేతమా?!

రాష్ట్రంలో ప్రధాన సామాజికవర్గమైన కాపుల్లో ఒక రకమైన అలజడి ప్రారంభమైందని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బొండా ఉమమహేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టిస్తున్నాయి. గుంటూరులో జరిగిన మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ చేసిన పోరాటాలను, నాటి రాజకీయ పరిణామాలను గుర్తు చేసుకున్నారు. కాపుల కోసం ఏ క్షణంలోనైనా ప్రాణాలర్పించేందుకు సిద్ధపడిన వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని, కాపు రిజర్వేషన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల కోసం ఆయన అనేక ఉద్యమాలు నడిపారని కొనియాడారు. చివరి శ్వాస వరకు ఆయన నీతిగా జీవించారని ప్రశంసించారు. అయితే దాదాపు కోటి మంది ఉన్న కాపులలో అలజడి ఉందని అధికార పార్టీ నేత చేసిన వ్యాఖ్యలు అంతకుమించి అలజడి సృష్టిస్తున్నాయని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

2014లో రాష్ట్ర విభజన తర్వాత తాము అసెంబ్లీలో అడుగుపెట్టిన తరుణంలోనే కాపు ఉద్యమం పురుడు పోసుకుందని బొండా ఉమా తెలిపారు. ఆ సమయంలో తాము అధికారంలో ఉన్నామని, కాపుల సమస్యలపై ముద్రగడ ప్రభుత్వానికి వరుస లేఖలు రాశారని గుర్తు చేశారు. రిజర్వేషన్లు, ఉద్యోగుల పోస్టింగ్‌లు, రాజకీయ అంశాలకు సంబంధించి ఆ లేఖల్లో ఎన్నో డిమాండ్లు ఉన్నాయని చెప్పారు. ముద్రగడ రాసిన ఆ లేఖల్లోని అంశాలపై ప్రభుత్వం ఆలోచించాలని, వాటి సాధ్యాసాధ్యాలపై ఒక కమిటీ వేయాలని నాడు తాము టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వెల్లడించారు. అంతేకాకుండా, ముద్రగడను నేరుగా పిలిచి చర్చలు జరిపితే బాగుంటుందని తాము అధిష్టానానికి సూచించినట్లు స్పష్టం చేశారు.

అయితే, సొంత సామాజిక వర్గానికి చెందిన కొందరు నేతలు ముద్రగడ గురించి ప్రభుత్వ పెద్దలకు తప్పుడు సమాచారం ఇచ్చారని, ఆయనకు కాపుల్లో అంతగా పట్టులేదంటూ తప్పుదోవ పట్టించారని బొండా ఉమా ఆరోపించారు. దీనివల్ల ముద్రగడ రాసిన లేఖలు ప్రయోజనం లేకుండా పోయాయన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా కాపు నేతలంతా ముద్రగడ వెనుక నడిచారని, తుని సభ తదితర పరిణామాలు అందరికీ తెలిసిందేనని అన్నారు. గ్రామస్థాయి వరకు ఉద్యమాన్ని తీసుకువెళ్లిన ముద్రగడ, 'కంచాలు కొట్టాలంటూ' పిలుపునిస్తే రాష్ట్రవ్యాప్తంగా కాపులంతా ఆచరించారని గుర్తు చేశారు. ముద్రగడ ఉద్యమ తీవ్రత వల్లే 2019 ఎన్నికల్లో తాము అధికారం కోల్పోవాల్సి వచ్చిందని ఆయన విశ్లేషించారు.

"కాపులు ఏ వైపు నిలిస్తే, రాష్ట్రంలో అటువైపు ప్రభుత్వాలు వస్తాయి. రాష్ట్రంలో ఐదు కోట్ల జనాభాలో కోటి మందికి పైగా బలిజ, కాపు, తూర్పుకాపు, ఒంటరి సామాజిక వర్గాలు ఉన్నాయి. ఈ సామాజిక వర్గాలే ప్రభుత్వాల ఏర్పాటును నిర్ణయిస్తాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా కాపుల్లో అలజడి మొదలైంది. ఈ అలజడిని పట్టించుకోవాల్సిన అవసరం ఉంది." అంటూ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాపుల న్యాయమైన డిమాండ్లను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని బొండా ఉమా హామీ ఇచ్చారు.

రాష్ట్ర జనాభాలో 25 శాతంగా ఉన్న కాపు, బలిజ తదితర అనుబంధ కులాలకు దామాషా ప్రకారం బడ్జెట్ నిధులు, రాజకీయ పదవులు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇతర సంక్షేమ పథకాలు దక్కాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన బలంగా వాదించారు. సొంత పార్టీ ప్రభుత్వ హయాంలోనే ఒక సీనియర్ ఎమ్మెల్యే కాపు సామాజిక వర్గంలో నెలకొన్న అసంతృప్తి, అలజడి గురించి బహిరంగంగా మాట్లాడటం, వారి డిమాండ్లకు మద్దతుగా నిలవడం ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ఏ విధంగా స్పందిస్తుంది, ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## ఇద్దరు అంతరాష్ట్ర స్మగ్లర్ల అరెస్టు

**వారికి సహకరిస్తున్న ఫారెస్టు బీట్ ఆఫీసర్ కూడా.. - రూ.1.50 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం**

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లాలో నిర్వహించిన దాడుల్లో పెద్ద ఎత్తున ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ హెడ్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం కపిలతీర్థంలోని టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం దుంగలను కర్ణాటక, హరియాణా, పశ్చిమ బెంగాల్‌కు తరలిస్తున్న ప్రధాన స్మగ్లింగ్ నెట్‌వర్క్‌ను ఛేదించినట్లు చెప్పారు. 'టాస్క్‌ఫోర్స్, రాష్ట్ర నిఘా బృందం, అటవీ శాఖకు వచ్చిన సమాచారం మేరకు వైఎస్సార్ కడప జిల్లా అవధూత కాశినాయన మండలం వరికుంట్ల గ్రామ సమీపంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టాం. ఓ వాహనంలో గృహోపకరణాల మాటున ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్నట్లు సిబ్బంది గుర్తించారు. హరియాణాకు చెందిన సన్నీ, రమేశ్‌లను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న 78 దుంగల విలువ రూ.1.5 కోట్లు ఉంటుంది. వాహనాన్ని సీజ్ చేశామ'ని వివరించారు. ఈ స్మగ్లర్లకు సహకరిస్తున్న జ్యోతిగుడి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మల్లికార్జునను కూడా అరెస్టు చేసినట్లు చెప్పారు. బెంగళూరు, హరియాణా, కోల్‌కతాలో ప్రధాన నిందితులను గుర్తించామని, త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అటవీ సంపద స్మగ్లింగ్ నిరోధానికి 'ఆపరేషన్ అరణ్య' ద్వారా నిరంతరం సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

## పోయిన డబ్బు ఇప్పిస్తామంటూ ఉన్నది కాస్తా దోచేశారు

**రూ.1.23 కోట్లు మోసపోయిన బాధితుడిని మళ్లీ బురిడీ కొట్టించిన కేటుగాళ్లు**

**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకసారి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితుడిని.. పోయిన డబ్బు తిరిగి ఇప్పిస్తామని నమ్మించి మరోసారి బురిడీ కొట్టించారు. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం ముక్తినూతలపాడు గ్రామానికి చెందిన వ్యక్తికి రెండేళ్ల క్రితం సైబర్ నేరగాళ్ల నుంచి సందేశం వచ్చింది. ఆన్‌లైన్ బిట్‌కాయిన్ ట్రేడింగ్ చేస్తే అధిక లాభాలు వస్తాయంటూ ఆశ చూపారు. కొంతకాలం సంప్రదింపులు జరిపి విడతల వారీగా ఆయనతో పెట్టుబడులు పెట్టించారు. అలా రూ.1.23 కోట్లు కాజేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు గతేడాది ఏప్రిల్‌లో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు విచారణలో ఉండగా తాను సైబర్ సెక్యూరిటీ వింగ్‌లో అధికారిగా పనిచేస్తున్నానంటూ పల్నాడు జిల్లాకు చెందిన కె.ప్రదీప్ అనే వ్యక్తి బాధితుడికి ఫోన్ చేశారు. పోగొట్టుకున్న డబ్బును మూడు నెలల్లో ఇప్పిస్తానని చెప్పి ఆన్‌లైన్ ద్వారా రూ.5.50 లక్షలను అతడి నుంచి లాగేశాడు. బిట్‌కాయిన్ డబ్బులు వచ్చేస్తున్నాయంటూ నకిలీ పత్రాలు చూపించాడు. నగదు తిరిగి వచ్చేలా చేసినందుకు తనకు బుల్లెట్ బండి, కారు కొనాల్సిందిగా కోరాడు. నిజమేనని నమ్మిన బాధితుడు బుల్లెట్ బండి కొని సదురు మోసగాడు చెప్పిన చిరునామాకు పార్సిల్ చేయించారు. ఎంతకీ డబ్బులు రాకపోయేసరికి ప్రశ్నించగా.. నకిలీ గుర్తింపుకార్డులు, పోలీసు యూనిఫాంతో భయపెట్టాడు. చివరికి బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ప్రదీప్‌ను సైబర్ మోసగాడిగా తేల్చి కేసు నమోదు చేశారు.

## కూకట్‌పల్లిలో రోడ్డు ప్రమాదం : ఇద్దరి మృతి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూకట్‌పల్లిలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. క్రికెట్ ఆడేందుకు ముగ్గురు యువకులు స్కూటీపై వెళ్తున్నారు. వేగంగా వచ్చిన టిప్పర్ లారీ స్కూటీని ఢీకొనడంతో మహేష్ (17), లక్ష్మీతేజ (17) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు టిప్పర్‌ను సీజ్ చేశారు.

## పెద్దాపురం ఆర్డీవో నివాసంలో చోరీ



**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పెద్దాపురం ఆర్డీవో పి.కృష్ణమూర్తి ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆర్డీవో కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చొరబడిన దొంగలు 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.70వేల నగదు అపహరించారు. ఘటనా స్థలిని డీఎస్పీ తిలక్ పరిశీలించారు. పెద్దాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నార్కట్‌పల్లి చెర్వుగట్టు పుణ్యక్షేత్రం వద్ద భారీ అగ్ని ప్రమాదం



**నార్కట్‌పల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామివారి గుట్టకింద అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. బొమ్మల దుకాణంలో చెలరేగిన మంటలు క్రమంగా 17 దుకాణాలు, 15 తోపుడు బండ్లకు వ్యాపించడంతో.. అవి అగ్నికి ఆహుతయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. ప్రమాద తీవ్రతకు రెండు గ్యాస్ సిలిండర్లు సైతం పేలినట్లు స్థానికులు తెలిపారు. ఘటనాస్థలానికి సమీపంలో ఉన్న గ్రామపంచాయతీ కార్యాలయానికీ మంటలు వ్యాపించాయి. దీంతో కార్యాలయంలోని పలు దస్త్రాలు కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని 3 ఫైర్ ఇంజిన్ల సాయంతో మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.2.5 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వేళ ప్రమాదం జరగడం.. ఆ సమయంలో దుకాణాల్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



విశ్వవాయిస్
అవినీతిపై - అక్షర సమరం...
VISWAMVOICE TELUGU DAILY
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎడిషన్లు
సోమవారం, 27 జూలై, 2026








www.viswamvoice.com
సత్యం • సమగ్రం • సమాజ బాధ్యత
www.viswamvoice.com


# పి.గన్నవరం టీడీపీలో ఇన్‌చార్జ్ మంటలు!

## జిల్లా నేతల ముందే భగ్గుమన్న అసంతృప్తి

- వెంటనే నియోజకవర్గ ఇన్‌చార్జిని ప్రకటించాలి అంటూ కార్యకర్తల నినాదాలు
- గుత్తుల సాయి, గంధం పల్లంరాజు సమక్షంలో సమావేశం రసాభాస
- పదిరోజుల క్రితమే అభిప్రాయ సేకరణ.. ఇంకా వెలువడని అధిష్టానం నిర్ణయం
- స్థానికుడికే బాధ్యతలు అప్పగించాలని టీడీపీ శ్రేణుల పట్టుబాటు
- నాయకత్వ ఖాళీతో మండలాలవారీగా పెరుగుతున్న వర్గ విభేదాలు



పి.గన్నవరం లో సమావేశంలో ఎన్‌టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

### అధిష్టానం తేల్చాల్సిన ప్రశ్నలివే

- ఎవరిని ఇన్‌చార్జిగా నియమిస్తారు?
- స్థానిక నాయకుడికే ప్రాధాన్యం ఇస్తారా?
- జూలై 16న సేకరించిన అభిప్రాయాల ఫలితం ఏమైంది?
- వర్గాల మధ్య సయోధ్యకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
- జనసేన ఎమ్మెల్యేతో టీడీపీ ఇన్‌చార్జ్ సమన్వయం ఎలా ఉంటుంది?

పి.గన్నవరం, విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో చాలా కాలంగా నివురుగప్పిన నిప్పులా కొనసాగుతున్న ఇన్‌చార్జ్ వివాదం ఆదివారం ఒక్కసారిగా భగ్గుమంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నప్పటికీ నియోజకవర్గ టీడీపీకి పూర్తిస్థాయి ఇన్‌చార్జిని ప్రకటించకపోవడంపై స్థానిక నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ముఖ్య నేతల సమక్షంలో నిర్వహించిన పార్టీ సమావేశాన్ని కార్యకర్తలు అడ్డుకుని నిరసనకు దిగారు. "పి.గన్నవరం టీడీపీకి వెంటనే ఇన్‌చార్జిని ప్రకటించాలి", "స్థానిక నాయకుడికే బాధ్యతలు అప్పగించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో పార్టీ కార్యాలయంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు కార్యకర్తలను సముదాయించేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి వెంటనే అదుపులోకి రాలేదు.

**'డోర్ టు డోర్' సమావేశంలోనే నిరసన**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు జూలై 27 నుంచి చేపట్టనున్న 'డోర్ టు డోర్' ప్రచార కార్యక్రమంపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించేందుకు ఆదివారం పి.గన్నవరం టీడీపీ కార్యాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజుతో పాటు నియోజకవర్గంలోని పలువురు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. జిల్లా నేతలు పార్టీ కార్యక్రమాలను వివరించి, క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టాల్సిన విధానంపై మాట్లాడుతున్న సమయంలోనే కొందరు స్థానిక నాయకులు లేచి ఇన్‌చార్జ్ నియామకంపై ప్రశ్నించారు. రెండేళ్లుగా నియోజకవర్గానికి నాయకత్వం లేకుండా పార్టీ కార్యక్రమాలు ఎలా నిర్వహించాలని నిలదీశారు. ఈ దశలో మరికొందరు కార్యకర్తలు కూడా వారికి మద్దతుగా నిలిచి నినాదాలు ప్రారంభించారు. దీంతో సమావేశం ప్రధాన ఉద్దేశం పక్కకు వెళ్లి, ఇన్‌చార్జ్ నియామకమే ప్రధాన చర్చగా మారింది.

**'ఎన్నాళ్లు నాయకత్వం లేకుండా పనిచేయాలి?'**

నియోజకవర్గంలో పార్టీకి శాశ్వత నాయకత్వం లేకపోవడంతో క్షేత్రస్థాయి కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళనకారులు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను ఎవరి దృష్టికి తీసుకెళ్లాలో తెలియడం లేదని, మండలాల మధ్య సమన్వయం కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, స్థానిక సమస్యలపై అధికారులతో మాట్లాడడం, పార్టీ కార్యక్రమాలకు నాయకులను సమీకరించడం, కార్యకర్తల మధ్య విభేదాలను పరిష్కరించడం వంటి బాధ్యతలను చేపట్టే నాయకుడు లేకపోవడంతో పార్టీ శ్రేణులు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయని తెలిపారు. నియోజకవర్గస్థాయిలో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని, మండలాలవారీగా నాయకులు వేర్వేరు దారుల్లో పనిచేస్తుండటంతో పార్టీలో గందరగోళం పెరుగుతోందని పేర్కొన్నారు.

**స్థానికుడికే పగ్గాలు ఇవ్వాలి**

పి.గన్నవరం నియోజకవర్గానికి సంబంధం లేని స్థానికేతర నాయకుడిని ఇన్‌చార్జిగా నియమిస్తే అంగీకరించబోమని కొందరు కార్యకర్తలు స్పష్టం చేసినట్లు సమాచారం. నియోజకవర్గంలోని గ్రామాలు, ప్రజల సమస్యలు, పార్టీ కార్యకర్తల కష్టనష్టాలు తెలిసిన నాయకుడికే బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు, కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండటం, నాలుగు మండలాల్లో పార్టీని సమన్వయం చేయగలగడం, కూటమి నాయకులతో కలిసి పనిచేయడం, గ్రామస్థాయిలో టీడీపీని బలోపేతం చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఇన్‌చార్జిని ఎంపిక చేయాలని కోరారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన సీనియర్ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వకుండా బయటి వ్యక్తులను తీసుకొస్తే క్షేత్రస్థాయి శ్రేణుల్లో మరింత అసంతృప్తి పెరుగుతుందని హెచ్చరించారు.

**జిల్లా నేతల సర్దిచెప్పే ప్రయత్నం**

కార్యకర్తల ఆందోళనతో సమావేశం ఉద్రిక్తంగా మారడంతో జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజు జోక్యం చేసుకున్నారు. ఇన్‌చార్జ్ నియామకం పార్టీ అధిష్ఠానం పరిధిలోని అంశమని, కార్యకర్తల అభిప్రాయాలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. పార్టీ కార్యక్రమాలకు ఆటంకం కలిగించకుండా క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. నియామకంపై ఇప్పటికే అధిష్ఠానం కసరత్తు చేస్తోందని, తగిన సమయంలో నిర్ణయం వెలువడుతుందని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, ఇన్‌చార్జ్ నియామకంపై స్పష్టమైన గడువు చెప్పాలని కార్యకర్తలు పట్టుబట్టారు. అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు తమ డిమాండ్‌ను కొనసాగిస్తామని తేల్చిచెప్పడంతో సమావేశం కొంతసేపు గందరగోళంగా మారింది.

**పదిరోజుల క్రితమే అభిప్రాయ సేకరణ**

పి.గన్నవరం టీడీపీ ఇన్‌చార్జ్ ఎంపికపై పార్టీ అధిష్ఠానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. జూలై 16న పి.గన్నవరంలోని ధనవర్ష కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఆ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, జోనల్ ఇన్‌చార్జ్ సుజయకృష్ణ రంగారావు, జిల్లా పరిశీలకుడు అంగర రామమోహన్ పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎవరిని నియమించాలనే అంశంపై కార్యకర్తల అభిప్రాయాలను సేకరించినట్లు అప్పట్లో పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇన్‌చార్జ్ లేకపోయినా 2024 ఎన్నికల్లో కూటమి విజయం కోసం టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేసినా వారి నాయకత్వంలో సమష్టిగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అభిప్రాయ సేకరణ జరిగి పదిరోజులు గడుస్తున్నప్పటికీ నియామకంపై అధికారిక ప్రకటన వెలువడకపోవడం కార్యకర్తల్లో అసహనాన్ని మరింత పెంచినట్లు తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి.

**2024 ఎన్నికల్లో అనూహ్య మలుపు**

పి.గన్నవరం నియోజకవర్గ రాజకీయాల్లో 2024 ఎన్నికల సమయంలోనే అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ తొలి అభ్యర్థుల జాబితాలో సరిపెళ్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్‌ను పి.గన్నవరం అభ్యర్థిగా ప్రకటించింది. అయితే, ఆయన అభ్యర్థిత్వంపై నియోజకవర్గంలోని కొన్ని వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అనంతరం కూటమి సీట్ల సర్దుబాటులో పి.గన్నవరం స్థానాన్ని జనసేనకు కేటాయించారు. జనసేన అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణను ప్రకటించడంతో మహాసేన రాజేష్ పోటీ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. 2024 శాసనసభ ఎన్నికల్లో జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ 96,108 ఓట్లు సాధించి విజయం సాధించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావుకు 62,741 ఓట్లు లభించాయి. గిడ్డి సత్యనారాయణ 33,367 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.



జిల్లా నేతలకు వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు




జనసేన పార్టీ ఎమ్మెల్యే గుత్తుల సాయితో మెటీవఅర్పిస్తున్న గంధం పల్లంరాజు

**ఎమ్మెల్యే జనసేన.. టీడీపీకి ప్రత్యేక నాయకత్వం అవసరం**

పి.గన్నవరం నియోజకవర్గంలో ప్రస్తుతం జనసేనకు చెందిన గిడ్డి సత్యనారాయణ శాసనసభ్యుడిగా ఉన్నారు. అయితే, కూటమిలో భాగస్వామ్య పార్టీగా టీడీపీకి గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సంస్థాగత నిర్మాణం అవసరమని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేతో సమన్వయం కొనసాగిస్తూనే టీడీపీ సభ్యత్వ కార్యక్రమాలు, పార్టీ కమిటీల ఏర్పాటు, కార్యకర్తల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల ప్రచారం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతను పర్యవేక్షించేందుకు పూర్తిస్థాయి ఇన్‌చార్జ్ అవసరమని వాదిస్తున్నారు. ఇన్‌చార్జ్ లేకపోవడం వల్ల టీడీపీ కార్యకర్తలు తమ రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నారని, కూటమి ప్రభుత్వంలో తమకు తగిన గుర్తింపు లభించడం లేదన్న భావన కొందరిలో పెరుగుతోందని స్థానిక నాయకులు చెబుతున్నారు.

**ఇప్పటికే రెండు వర్గాలుగా కార్యకలాపాలు?**

పి.గన్నవరం టీడీపీలో నాయకత్వ ఖాళీ కారణంగా అంతర్గత విభేదాలు పెరుగుతున్నట్లు గతంలోనూ వార్తలు వెలువడ్డాయి. పార్టీ అధిష్ఠానం సూచించిన కమిటీలను ఒక వర్గం అంగీకరిస్తుండగా, మరో వర్గం సొంతంగా మండలస్థాయి కమిటీలను ప్రకటించుకున్నట్లు ప్రచారం జరిగింది. కొన్ని పార్టీ కార్యక్రమాలు కూడా వేర్వేరు వర్గాల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయని, దీంతో సాధారణ కార్యకర్తలు ఎవరి నాయకత్వంలో పనిచేయాలో తెలియక అయోమయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఇన్‌చార్జిని కార్యకర్తల అభిప్రాయం లేదా ఓటింగ్ విధానంలో ఎంపిక చేయాలన్న డిమాండ్ కూడా గతంలో వినిపించింది. అధిష్ఠానం తక్షణమే జోక్యం చేసుకుని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన నాయకుడిని నియమించకపోతే విభేదాలు మరింత ముదిరే ప్రమాదం ఉందని పార్టీ సీనియర్ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**కూటమి సమన్వయానికీ కీలక పరీక్ష**

పి.గన్నవరం స్థానాన్ని జనసేన ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో టీడీపీ ఇన్‌చార్జ్ ఎంపిక అత్యంత సున్నితమైన అంశంగా మారింది. పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయగలగడంతో పాటు జనసేన ఎమ్మెల్యే, కూటమి నాయకులతో కలిసి పనిచేయగల నాయకుడిని ఎంపిక చేయాల్సిన అవసరం అధిష్ఠానంపై ఉంది. స్థానికంగా బలమైన నాయకుడిని నియమిస్తే టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం పెరుగుతుందని ఒక వర్గం భావిస్తోంది. మరోవైపు, ఎంపిక విషయంలో ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే ఇప్పటికే ఉన్న వర్గ విభేదాలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య ఆధిపత్య పోరుగా పరిస్థితి మారకుండా, పార్టీ సంస్థాగత అవసరాలు-కూటమి సమన్వయం రెండింటినీ సమతుల్యం చేసే నిర్ణయం తీసుకోవడం టీడీపీ అధిష్ఠానానికి సవాల్‌గా మారింది.

**స్థానిక ఎన్నికల ముందు అధిష్ఠానానికి పరీక్ష**

స్థానిక సంస్థల ఎన్నికల దిశగా పార్టీ శ్రేణులను సిద్ధం చేయాల్సిన సమయంలో పి.గన్నవరంలో నాయకత్వ వివాదం భగ్గుమనడం టీడీపీకి ఇబ్బందికరంగా మారింది. గ్రామ, మండలస్థాయిలో అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటు, ప్రచార కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలకు బలమైన నాయకత్వం అవసరం. ఇన్‌చార్జ్ నియామకం మరింత ఆలస్యమైతే కార్యకర్తల్లో నిరాశ పెరగడంతో పాటు పార్టీ కార్యక్రమాలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానిక నాయకులు హెచ్చరిస్తున్నారు. జూలై 16న అభిప్రాయ సేకరణ నిర్వహించిన అధిష్ఠానం, ఆదివారం జరిగిన నిరసన తర్వాతైనా త్వరగా నిర్ణయం ప్రకటిస్తుందా? స్థానిక నాయకుడికే పగ్గాలు అప్పగిస్తుందా? లేక

### పి.గన్నవరం ఇన్‌చార్జ్ వివాదం - పరిణామాల క్రమం

**ఫిబ్రవరి 2024:** పి.గన్నవరం టీడీపీ అభ్యర్థిగా మహాసేన రాజేష్ పేరు ప్రకటన.

**మార్చి 2024:** కూటమి సీట్ల సర్దుబాటులో పి.గన్నవరం జనసేనకు కేటాయింపు.

**మార్చి 2024:** జనసేన అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ ప్రకటన.

**జూన్ 2024:** గిడ్డి సత్యనారాయణ 33,367 ఓట్ల ఆధిక్యంతో విజయం.

**2024-2026:** టీడీపీకి పూర్తిస్థాయి నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేకపోవడంతో నాయకత్వ ఖాళీ.

**ఏప్రిల్ 2026:** మండల కమిటీలు, స్థానిక-స్థానికేతర నాయకత్వంపై పార్టీలో విభేదాలు వెలుగులోకి రావడం.

**జూలై 16, 2026:** మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తల అభిప్రాయ సేకరణ.

**జూలై 26, 2026:** జిల్లా నేతల సమక్షంలో టీడీపీ కార్యకర్తల నిరసన.

**జూలై 27, 2026:** పార్టీ 'డోర్ టు డోర్' కార్యక్రమం ప్రారంభం.



### అర్హులైన ప్రతి దివ్యాంగుడికి

# ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తాం : ఎంపీ హరీష్

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటామని పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ తెలిపారు. ఆదివారం అమలాపురంలోని అంబేద్కర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల మోటరైజ్డ్ స్కూటీల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్కూటీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి ప్రయోజనాలు చేరేలా కృషి చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంలో తమ పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన అభ్యర్థుల విద్యార్హతలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు తదితర అర్హతలను పరిశీలించి ఎంపిక చేసిన లబ్ధిదారులకు మోటరైజ్డ్ స్కూటీలను పంపిణీ చేశారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలు,



సూచనలు తెలుసుకున్నారు.దివ్యాంగుల సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్ర మాలను కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావం తులు మరియు వయోవృద్ధుల సహాయ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గుడిపూడి నారాయణ స్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 10 చొప్పున మొత్తం 1,800 మోటరైజ్డ్ స్కూటీలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కోనసీమ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు 10 చొప్పున మొత్తం 70 మంది దివ్యాం గులకు సుమారు రూ.1.20 లక్షల విలువైన స్కూటీలను అందజేసినట్లు పేర్కొన్నారు. దివ్యాంగులు ఇతరులపై ఆధారపడకుండా విద్య, ఉపాధి, ఉద్యోగం, వ్యాపారం వంటి రంగాల్లో స్వయం సమర్థులుగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు, టిడ్కో గృహాల్లో గ్రౌండ్ ఫ్లోర్ కేటాయింపుకు ప్రాధాన్యం, స్వయం ఉపాధి రుణాలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవి మాట్లాడుతూ సమాజంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి దివ్యాంగుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ స్కూటీలు దివ్యాంగుల చలనశీలతను పెంచి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్, రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కలిసి మోటరైజ్డ్ స్కూటీలను పచ్చజెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో డీఆర్వో వి. సుబ్బారావు, ఆర్డీవో దేవిశెట్టి శ్రీనివాసరావు, రామచంద్రపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి, ప్రధాన కార్యదర్శి పల్లంరాజు, విభిన్న ప్రతిభావంతుల అసిస్టెంట్ డైరెక్టర్ ఌ జిల్లా మేనేజర్ ఏ.వై. శ్రీనివాస్, పునరావాస అధికారి శ్రీరామ్, కూటమి నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### మాస్టర్స్ నేషనల్ పవర్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించిన

# అప్పన్నకు ఎంపీ ప్రశంసలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ నెల 18 నుంచి 21 వరకు జరిగిన మాస్టర్స్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్లో 120 కేజీల విభాగంలో మొత్తం 550 కేజీల బరువెత్తి జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించిన ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కానిస్టేబుల్, నేషనల్ పవర్ లిఫ్టర్ బి.అప్పన్నను అమ లాపురం పార్లమెంట్ సభ్యుడు జి.ఎం.హరీష్ బాలయోగి ఘనంగా అభినందించారు. అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో అప్పన్నను ప్రత్యేకంగా సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ బాలయోగి మాట్లాడుతూ, అప్పన్న సాధించిన జాతీయ స్థాయి విజయం కోనసీమ జిల్లాతో పాటు రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆయన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరెందరో యువత పవర్ లిఫ్టింగ్‌తో పాటు ఇతర క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ కోచ్ కంకిపాటి వెంకటేశ్వరరావు, మంగిన నాని, వెలగట్ల జగదీష్, నేషనల్ వెయిట్ లిఫ్టర్ బి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో ఘనంగా 'ఎల్లో కలర్ డే' వేడుకలు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ చైతన్య టెక్నో స్కూల్, రావులపాలెం ప్రీ-ప్రైమరీ విభాగంలో 'ఎల్లో కలర్ డే' వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు పసుపు రంగు దుస్తులు ధరించి ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొని కార్యక్రమాన్ని రంగురంగులంగా మార్చుతూ ఆద్యాంతం ఆస్వాదించారు. విద్యార్థుల్లో రంగులపై అవగాహన పెంపొందించడంతో పాటు సృజనాత్మకతను అభివృద్ధి చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారనీ ఆర్ ఐ నరేష్ తెలిపారు.ఇందులో భాగంగా పలు వినోదాత్మక ఆటలు, పాటలు, నృత్యాలు, క్రాఫ్ట్ కార్యక్రమాలు మరియు పసుపు రంగు వస్తువుల ప్రదర్శనను నిర్వహించారు. పిల్లలందరూ ఎంతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జగదీష్, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జ్ లలిత మరియు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ వేడుక చిన్నారుల్లో రంగులపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం మరియు సృజనాత్మకతను మరింత పెంపొందించిందని నిర్వాహకులు తెలిపారు.

# ముద్రగడ పద్మనాభంకు అమలాపురంలో ఘన నివాళి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభను ఆదివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాపు జేఏసీ నాయకుడు నల్లా పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు కాపు నాయకులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు ముద్రగడ పద్మనాభం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమలాపురం ఎంపీ హరీష్ మాధుర్ మాట్లాడుతూ తన తండ్రి జి.ఎం.సి. బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా, ముద్రగడ పద్మనాభం ఎంపీగా ఒకే సమయంలో పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. పద్మనాభం ఎక్కడ ఉన్నా తన ఎదుగుదలను ఆకాంక్షించేవారని, అలాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం దురదృష్టకరమని అన్నారు. ఆయన ఆశయాలను కాపు రిజర్వేషన్ పోరాట సమితి, కాపు నాయకులు ముందుకు తీసుకెళ్లాలని కోరారు. వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ తన తండ్రికి, ముద్రగడ పద్మనాభానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇటువంటి నాయకుడిని కోల్పోవడం ఎంతో దురదృష్టకరమని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయి మాట్లాడుతూ ముద్రగడ ఇంటికి వెళ్లిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, భోజనం పెట్టే గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు. జాతి కోసం నిరంతరం పోరాడిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా ఎన్నికై జీవితమంతా ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన నాయకుడు ముద్రగడ పద్మనాభమని పేర్కొన్నారు. కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణుమూర్తి మాట్లాడుతూ ముద్రగడ పద్మనాభం భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ఆశయాలను సజీవంగా ఉంచి, కాపు రిజర్వేషన్ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కాపు జేసీసీ నాయకులు నల్లా పవన్ కుమార్, ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, కల్వకొలను తాతాజీ, జి.ఎల్. నరసింహారావు, చల్లా ప్రభాకర్ మాట్లాడుతూ కాపు ఉద్యమంలో ముద్రగడ చూపిన నాయకత్వం, ప్రేమాభిమానాలు, ఉద్యమంలో కలిసి పనిచేసిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ఆముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ భాగ్యశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, పాముల రాజేశ్వరి దేవి, ముమ్మిడివరం వైఎస్సార్సీపీ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీను, మెట్ల రమణబాబు, గంధం పల్లంరాజు, అయితాబత్తుల సుభాషిణి, అయినవిల్లి మాజీ జడ్పీటీసీ గంగుమల్ల కాశీ అన్నపూర్ణ శ్రీనివాస్, ఏడిద శ్రీను, నల్లా శ్రీధర్, నల్లా అజయ్, నల్లా సంజయ్ తదితరులు ముద్రగడ ఉద్యమ స్ఫూర్తి, రాజకీయ జీవితం గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూదా గణపతి, నల్లా రామకృష్ణ, దంగుడు బియ్యం శ్రీనివాస్, అరిగెల నాని, తులా గోపాలకృష్ణ, చీకట్ల కిషోర్, కొల్లాటి దుర్గాబాయి, ఆకుల సూర్యనారాయణమూర్తి, లయన్స్ క్లబ్ రవణం వేణు, అయితాబత్తుల ఉమా మహేశ్వరరావు, నల్లా స్వామి, నల్లా మల్లిబాబు, గోకరకొండ గంగన్న స్వామి, కంకిపాటి వెంకటేశ్వరరావు, బండి శ్రీను, గనిశెట్టి వెంకటేశ్వరరావు, జంగా రాజేంద్రకుమార్, కర్రి బాబురావు, నల్లా పెదకాపు, కొమ్ముల రాము, కురసా ఆంజనేయులు, కటికిరెడ్డి తమ్మయ్య నాయుడు, దున్నాల దుర్గ, పోలిశెట్టి కన్నా, కల్వకొలను ఉమా, బెజవాడ సత్తిబాబు తదితర నాయకులు, ముద్రగడ అభిమా నులు పాల్గొన్నారు.

# జిల్లాలో భారీ వర్షం



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో పలుచోట్ల ఆదివారం ఉదయం వర్షం కురిసింది. మురమళ్ల, ముమ్మిడివరం, ఐ.పోలవరం తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా వాతావరణం మారి పోయింది. అనంతరం కురిసిన భారీ వర్షానికి పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయితే, ఈ వర్షం వరి సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

### మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానంను దర్శించిన

# మాజీ ఉపరాష్ట్రపతి కుమారుడు, కోడలు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవ స్థానం నందు భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకన్న నాయుడు కుమారుడు మరియు కోడలు అయినటువంటి హర్ష టయోటా మేనేజింగ్ డైరెక్టర్ ముప్పవరపు హర్ష కుమార్, రాధా దంపతులు, హైదరాబాద్ వారు దేవస్థానం అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం విరాళంగా రూ.50,000/- లు సమర్పించినారు. ముప్పవరపు రాధ ముందుగా శ్రీ స్వామివారికి వారి బంధు సమూహంతో తైలాభిషేకం నిర్వహించుకుని, అనంతరం శ్రీ స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు అని దారపురెడ్డి సురేష్ బాబు, అసిస్టెంట్ కమిషనర్ & ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ తెలియజేశారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకులంలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం (బాలురు), ద్రాక్షారామను రామచంద్రపురం ఆర్డీఓ ఏ.సరళవతి ఆదివారం ఆక స్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్లు, విద్యా ప్రతిభకు సంబంధించిన మార్కుల రికార్డులను పరిశీలించారు. గురుకులంలోని వాష్ రూమ్‌లు, వంటశాల, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న భోజనం, బియ్యం, పప్పు దినుసుల నాణ్యతను పరిశీలించారు. వాష్‌రూమ్‌లలో పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతిరోజూ శుభ్రపరిచి బ్లీచింగ్, క్లోరినేషన్ నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్‌ను ఆదేశించారు. అలాగే విద్యార్థుల తరగతి గదులు, వసతి గదుల్లో పనిచేయని ఫ్యాన్లను వెంటనే మరమ్మతు చేయించి అన్ని ఫ్యాన్లు సక్రమంగా పనిచేసేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. గురుకులంలో చేపట్టిన చర్యలను పరిశీలించేందుకు వచ్చే వారంలో మళ్లీ ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తానని ఆర్డీఓ ఏ.సరళవతి తెలిపారు. ఈ తనిఖీ నందు శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్, హాస్టల్ వార్డెన్, పరమ జ్యోతి వీఆర్వో మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# రామచంద్రపురం మైదానంలో నియోజకవర్గ స్థాయి క్రీడల ఎంపికలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జరుగుతున్న అమరావతి ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గ స్థాయి పదిహేడేళ్లు, ఇరవై మూడేళ్ల లోపు విభాగాల బాలురు, బాలికలకు పన్నెండు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో సోమవారం బాలురకు, మంగళవారం బాలికలకు ఉదయం తొమ్మిది గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని ఉపవిద్యాశాఖాధికారి పి. రామలక్ష్మణమూర్తి తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు అంతర్జాలంలో నమోదు చేసుకుని, ఆ నమోదు పత్రంతో పాటు జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని నియోజకవర్గ బాధ్యులు సిహెచ్. లక్ష్మి శ్రీనివాస్ వెల్లడించారు. పాల్గొనే క్రీడాకారులందరికీ భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖాధికారులు మానేపూడి శ్రీనివాస్, నాగేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాడి వీర రాఘవరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఈ నెల 28న అమలాపురంలో

# వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఈ నెల 28వ తేదీన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి వ్యతిరేకంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తెలిపారు. కాజులూరు గ్రామంలో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల అధ్యక్షులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు 3,000 రూపాయల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చలేదని విమర్శించారు. మెగా డీఎస్సీ పేరుతో జరిగిన ప్రక్రియలో అవకతవకలు జరిగాయని, నకిలీ పత్రాల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విద్యార్థులు, నిరుద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడినందుకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, లేదా ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి గృహాల బకాయిలను ప్రభుత్వం చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఈ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో అమలాపురంలో చేపట్టే నిరసన ర్యాలీలో విద్యార్థులు, నిరుద్యో యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### రాధా రంగా మిత్ర మండలి ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

# తోలేటి సూర్య గంగాధర్ నియామకం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర తెలంగాణ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రాధా రంగా మిత్ర మండలి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ద్రాక్షారామానికి చెందిన తోలేటి సూర్య గంగాధర్ నియమితులయ్యారు. ఈ మేరకు మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కాళ్ళపాలెం బుజ్జి నియామక పత్రాన్ని అందజేసి, బాధ్యతలను అప్పగించారు. తనపై నమ్మకంతో ఈ బృహత్తర బాధ్యతను అప్పగించిన మిత్ర మండలి అధ్యక్షుడు కాళ్ళపాలెం బుజ్జికి, సభ్యులకు తోలేటి సూర్య గంగాధర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. రంగా ఆశయ సాధనకు, ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలోని అభిమానుల సంక్షేమానికి, సంఘ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# రామచంద్రపురం భాష్యం స్కూల్‌లో ఘనంగా తల్లిదండ్రుల దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక రామచంద్రపురం భాష్యం స్కూల్‌లో ప్రిన్సిపాల్ పి.భాస్కరరావు అధ్యక్షతన తల్లిదండ్రుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల అభివృద్ధి కోసం తల్లిదండ్రులు ఏ త్యాగానికైనా సిద్ధపడతారని తెలిపారు. మన సంస్కృతిలో "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ" అని ముందుగా తల్లిదండ్రులకే మొదటి స్థానం ఇచ్చారని, విద్యార్థుల నైతిక వికాసంలో వారి పాత్ర అత్యంత కీలకమైనదని పేర్కొన్నారు. శ్రవణ కుమారుని కథను ఉదాహరణగా చెప్తూ తల్లిదండ్రులను గౌరవించి చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉందన్నారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు ఎంచుకున్న రంగాల్లో రాణించి, వారికి అలాగే పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, గెలుపొందిన విజేతలకు పాఠశాల జోనల్ ప్రిన్సిపాల్ వల్లూరి గోవిందరాజు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్ పి. శాంతి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# సత్తెమ్మ తల్లి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం చీడిగా గ్రామంలో శ్రీ అభయ త్రిశక్తి సత్తెమ్మ తల్లి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలలో గ్రామస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ హాజరయ్యారు. ఆలయ కమిటీ వారు, అర్చకులు, గ్రామస్తులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రూరల్ ప్రజలు తల్లి ఆశీర్వాదాలతో ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో, ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే నానాజీ ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వచ్చిన ప్రతిభక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండాలని ఆలయ కమిటీ వారిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ ఉత్సవాలు చేస్తున్న ఆలయ కమిటీ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి, కరెడ్ల గోవింద్, పోనుగంటి మహేష్, పితాని అప్పన్న , అడపా కృష్ణ గారు, గీసాల శ్రీను, అడపా ఆదినారాయణ, శివ ప్రసాద్, తాతాజీ, రాంబాబు, గవర శ్రీరాములు, అప్పారావురావు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నాయకత్వ పటిమ పెరగాలి: జ్యోతుల నవీన్




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని టి.డి.పి పార్టీ ప్రెసిడెంట్ జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. స్థానిక అశోక నగర్‌లోని నారాయణ ఇ-టెక్నో పాఠశాలలో శనివారం నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ సెరిమనీ కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ ఏజీఎం కె.రాఘవేంద్ర రావు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు నాయకత్వ బాధ్యతలు, ఎన్నికల విధానంపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ డి హెడ్‌లు పి. రవికుమార్, మోహినీ, జోనల్ కో-ఆర్డినేటర్లు సుంకరమూర్తి, తులసి, ప్రిన్సిపల్ పి. రవికిషోర్, డీన్ సునీల్, వైస్ ప్రిన్సిపాల్ యమున, లైఫ్‌స్కిల్స్ ట్రైనర్ పద్మలత మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఇండ్లను, వాహనాలను

# కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ ద్వారా తనిఖీ చేసిన పోలీసులు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ పర్యవేక్షణలో సర్పవరం ఇన్స్పెక్టర్ చలుమూరి ప్రకాష్ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆదివారం (26.07.2026) ఉదయం 05.00 గంటల నుంచి 07.00 గంటల వరకు సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని వలసపాకల సెంటర్ ప్రాంతంలో పోలీసులు విస్తృత స్థాయిలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. వలస కూలీలు, దినసరి కార్మికులు అధికంగా నివసించే ప్రాంతంలో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో పోలీసులు 130 నివాస గృహాలను, 84 ద్విచక్ర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి నివాసితులు, వాహనాల వివరాలను పరిశీలించి అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన ధృవీకరణ చేపట్టారు. ఈ తనిఖీలలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు 10 ఈ-చలాన్లు జారీ చేశారు. అలాగే యాజమాన్యానికి సంబంధించిన సరైన పత్రాలు లేని ఆరు ద్విచక్ర వాహనాలను తదుపరి విచారణ నిమిత్తం సర్పవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యాజమాన్యాన్ని నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం సంబంధిత వాహన యజమానులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ టూ టౌన్ ఇన్స్పెక్టర్ మజ్జి అప్పలనాయుడు, కాకినాడ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నాగ దుర్గారావు, పోర్ట్ ఇన్స్పెక్టర్ పి.సునీల్ కుమార్, ఎస్సైలు యేసుబాబు, రాజ నరేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొని ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు.

### వైయస్సార్ పార్టీ ఆధ్వర్యంలో

# భారీ నిరసన ర్యాలీ

### ర్యాలీ పోస్టర్ విడుదల చేసిన నాయకులు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన కాకినాడ జిల్లా కేంద్రంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. ఆదివారం కాకినాడలోని పార్టీ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన గోడపత్రికను (పోస్టర్) వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా అధ్యక్షుడు తోట శ్రీ రాంజీ (రాంజీ) మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించిన ఆయన, దీనిపై నిష్పాక్షిక దర్యాప్తు కోసం వెంటనే సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని కోరారు.

### కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో

# త్రయాహ్నిక సంపూర్ణ చతుర్వేద వేద పారాయణం



**కోటిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటిపల్లి శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయంలో త్రయాహ్నిక సంపూర్ణ చతుర్వేద వేద పారాయణ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన 27 మంది వేద పండితులు, స్థానిక ఆలయ అర్చకులు పాల్గొని మూడు రోజుల పాటు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో శోభిల్లుతోంది. ఈ సందర్భంగా వేద పండితులు కందాల సూర్య శర్మ మాట్లాడుతూ, ఆదివారం ప్రారంభమైన ఈ సంపూర్ణ చతుర్వేద పారాయణం సోమ, మంగళవారాల వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. మొత్తం 27 మంది పండితులు ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదాలకు చెందిన మంత్రాలను పారాయణం చేస్తున్నారని వివరించారు. లోకక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవడం, ప్రజల ఆయురారోగ్యాలు, దేశ శాంతిసౌభాగ్యాల కోసం ఈ ప్రార్థనలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సనాతన ధర్మ వైభవాన్ని చాటిచెప్పడం, వేద సంప్రదాయాలను భావితరాలకు అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఆలయ నిర్వాహకులు వేద పండితులకు అవసరమైన సకల ఏర్పాట్లు చేయగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండితుల ఆశీర్వాదాలు పొందుతున్నారు.

### ప్రధాని మోదీ పర్యటనను

# విజయవంతం చేద్దాం

### ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ విచ్చేస్తున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లపై అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, శ్రీకాకుళం ఎమ్మెల్యేలతో కలిసి ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేలా నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టంగా నిలవనుందని అన్నారు. ప్రధాని మోదీ పర్యటన, బహిరంగ సభకు అమలాపురం నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో ప్రజలు, కూటమి శ్రేణులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రవాణా, తాగునీరు, పార్కింగ్, భద్రత తదితర ఏర్పాట్లపై నాయకులు, అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం ప్రాంత ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భాష్యంలో ఘనంగా జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన రాయవరంలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూలులో జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 మంది తల్లిదండ్రులకు విద్యార్థులు పాదపూజ నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్కులు విశ్వనాథ రామశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిదండ్రుల కోసం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గుప్త, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్నబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### నేటి నుంచి '2 ఏళ్ల నమ్మకం'తో

# ఎమ్మెల్యే వేగుళ్ల ప్రచారం

### 'రెండేళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా రాయవరం మండలంలో పర్యటన



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం - సంక్షేమం, అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుళ్ల జోగేశ్వరరావు నేటి నుంచి రాయవరం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు గ్రామాల్లోని స్థానిక సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు. పర్యటనలో భాగంగా నేటి (జూలై 27) ఉదయం 9 గంటలకు నదురుబాద, ఉదయం 10.30 గంటలకు వి.సావరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నారు. జూలై 28న మధ్యాహ్నం 2.30 గంటలకు వెదురుపాక, సాయంత్రం 4.30 గంటలకు లొల్ల, ఆగస్టు 2న మధ్యాహ్నం 2.30 గంటలకు పసలపూడి గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నారు. సంబంధిత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ వర్గాలు కోరాయి.

### అమలాపురంలో విభిన్న ప్రతిభావంతులకు

# మూడు చక్రాల వాహనాల పంపిణీ : ఎంపీ హరీష్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నల్లవంతెన సమీపంలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో జిల్లా విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ఉచితంగా మూడు చక్రాల వాహనాల పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మూడు చక్రాల వాహనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. వారి అవసరాలను గుర్తించి ఉపయుక్తమైన సహాయక పరికరాలు అందించడం ద్వారా స్వయం సమృద్ధి సాధించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మూడు చక్రాల వాహనాలు అందుకోవడం వల్ల లబ్ధిదారుల సంచారం సులభతరమై, వారి దైనందిన జీవితంలో స్వావలంబన పెరుగుతుందని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ విభిన్న ప్రతిభావంతుల పట్ల సానుభూతితో కాకుండా సమానత్వ దృక్పథంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల మరియు వయోవృద్ధుల సహాయ సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధల నడుమ శ్రీదేవి అమ్మవారికి

# ఘనంగా సారె ఊరేగింపు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆషాఢ మాస మహా పర్వ దినాన్ని పురస్కరించుకుని అమలాపురం దేవి మార్కెట్ లోని శ్రీదేవి అమ్మవారికి సంప్రదాయబద్ధంగా సారే ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి అమ్మవారికి సోదరుడిగా భావించే శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం నుంచి సారెను ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ శోభాయాత్ర వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రారంభమై, పుల్లయ్య రామాలయం, ముమ్మిడివరం గేటు, గ్రామదేవత సుబ్బాలమ్మ తల్లి ఆలయం, గడియార స్తంభం, గణపతి గుడి, హైస్కూల్ సెంటర్ మీదుగా సాగి, చివరకు శ్రీదేవి అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఊరేగింపులో మేలతాళాల వాయిద్యాలు, గరగ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోవింద నామస్మరణలు, జయజయధ్వానాల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో సారేను అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆషాఢ మాస సంప్రదాయానికి ప్రతీకగా నిర్వహించిన ఈ సారె ఊరేగింపు, యువతుల వేషధారణలు, భక్తులను విశేషంగా ఆకట్టుకుని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించింది.

# శాకాంబరీ దేవిగా గున్నేపల్లి సత్తెమ్మ తల్లి



**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం మండలం సిహెచ్ గున్నేపల్లిలో శ్రీ సత్తెమ్మ తల్లి ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాన్ని పూలతో శోభాయమానంగా అలంకరించారు. పలువురు దాతల ఆర్థిక సాయంతో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. రద్దీ దృష్ట్యా ఎస్సై శివకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

# కంబాల నాయకత్వం వర్ధిల్లాలి...

## సేవా కార్యక్రమాలతో ప్రజల మనసులు గెలుచుకుంటున్న బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు






**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలంలో భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు సేవా కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువవుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు అండగా నిలవడం, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం, దేవాలయాల అభివృద్ధికి సహకరించడం వంటి కార్యక్రమాల ద్వారా ఆయన ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. గోకవరం మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ అవసరమైన వారికి తన వంతు సహాయం అందిస్తూ, కష్టకాలంలో వారికి భరోసాగా నిలుస్తున్నారు. ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకొని, సాధ్యమైనంత మేర పరిష్కారం చూపేందుకు కృషి చేస్తుండటంతో స్థానికులు ఆయన సేవలను ప్రశంసిస్తున్నారు. దేవాలయాల అభివృద్ధి, పేదల సంక్షేమం, సామాజిక సేవ వంటి అనేక కార్యక్రమాలకు ఆయన ఉదారంగా సహకరిస్తూ వస్తున్నారు. ఇప్పటివరకు సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ఇకపై గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సమస్యలను గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని కంబాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడమే తన ప్రధాన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారం కోసం పూర్తి స్థాయిలో కృషి చేస్తానని ఆయన పిలుపునిచ్చారు. సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న కంబాల శ్రీనివాసరావు నాయకత్వం మరింత బలోపేతం కావాలని పలువురు స్థానికులు ఆకాంక్షించారు.

### వైయస్ఆర్‌సిపి విద్యార్థి యువజన విభాగం

# నిరసన ర్యాలీని జయప్రదం చేయండి

## అనపర్తి నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గా రెడ్డి (ఆర్కె)



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** జూలై 28వ తేదీ రాజమహేంద్రవరంలో వైయస్ఆర్ సిపి యువజన విభాగం, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న నిరసన ర్యాలీని జయప్రదం చేయాలని అనపర్తి నియోజకవర్గం వైయస్ఆర్ సిపి యువజన విభాగం అధ్యక్షుడు పడాల దుర్గారెడ్డి (ఆర్కే) పిలుపునిచ్చారు. శనివారం అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో దుర్గారెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు, రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తు కోసం, నిట్ పరీక్ష పేపర్ లీకేజ్, మెగా డీఎస్సీలో జరిగిన అవకతవకలు, రెండేళ్లుగా విద్యార్థులకు ప్రభుత్వం చెల్లిం చాల్సిన ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూవైయస్ఆర్ సిపి విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చిందని, ఇం దులో భాగంగా జూలై 28వ తేదీన తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కేంద్రం రాజమహేంద్రవరంలో షెల్టన్ హోటల్ నుండి సంహిత డిగ్రీ కాలేజ్ వరకు ర్యాలీ నిర్వహించబడుతుందనిఈ ర్యాలీ ఉదయం 9 గంటలకు షెల్టన్ హోటల్ నుండి ప్రారంభం అవుతుందనిఈ ర్యాలీ నందు అనపర్తి నియోజకవర్గం నాలుగు మండలాల నుండి వైయస్ఆర్ సిపి యువజన విభాగం విద్యార్థి విభాగం శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దుర్గారెడ్డి కోరారు ఈ సమావేశంలో తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్ సిపి అధికార ప్రతినిధి సబెళ్ళ కృష్ణారెడ్డి, పెద్దపూడి మండల స్టూడెంట్ వింగ్ అధ్యక్షులు ఉండ్రు రామారావు , అనపర్తి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కొండేటి భీమేష్ ,మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షులు నాయిబ్ రసూల్ ,పెదపూడి వైయస్సార్సీపి మండలం పార్టీ ఉపాధ్యక్షులు తోటకూర లోవరాజు తూర్పుగోదావరి జిల్లా ముస్లింస్ మైనార్టీ విభాగం సెక్రెటరీ ఇబ్రహీం, అనపర్తి టౌన్ ముస్లిం మైనార్టీ అధ్యక్షులు జాఫర్, అనపర్తిమండల ముస్లిం మైనారిటీ సెక్రెటరీ సికిందర్, మండల యువజన విభాగంజనరల్ సెక్రెటరీ సత్తి మణికంఠ రెడ్డి, యువజన విభాగం నాయకుడు కర్రి లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆవ..పి.హెచ్.సి. సమీపంలో ఎఫ్.ఎస్.ఎస్.తో కలిసి 42 మొక్కలు నాటిన

# 78 మంది ఆదిత్య ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాజమహేం ద్రవరం స్థానిక షెల్టన్ హోటల్ రోడ్డులో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపమున ఆవ దగ్గర ఉన్న రోడ్లకు ఇరుప్రక్కల 10, 12 అడుగుల మొక్కలను ఎఫ్ఎస్.ఎస్. ఆదిత్య డిగ్రీ కళాశాల, ఆదిత్య మహిళా డిగ్రీ పీజీ కళాశాల మరియు స్కూల్ ఆఫ్ యానిమేషన్ కు చెందిన ఎన్.ఎస్.ఎస్ మరియు యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు 42 మొక్కలు నాటడమే కాకుండా, ఆ మొక్కలకు సపోర్ట్‌గా వెదురు కర్రలను ఏర్పాటు చేసి తాడుతో కట్టడం జరిగింది.స్థానికులకు ఒక్కొక్క మొక్కను అప్పగించి దానిని పెంచి పెద్ద చేసే బాధ్యతను తీసుకోమని చెప్పారు. వాటికి రక్షణ చర్యలను చేపట్టాలని దత్తత నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇండియన్ యూత్ రెడ్ క్రాస్‌కు చెందిన ట్రెజరర్ డాక్టర్ జిఎన్‌బిఏబిఎస్ మహాలక్ష్మి, డాక్టర్‌బళ్ళ శ్రీనివాస్, గవర్న మెంట్ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్పిఓ బి.రామకృష్ణ, ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ, డాక్టర్ గోలివెంకట రామారావు, కె.సుధాకర్ పట్నాయక్, శ్యాం సుందర్, ఆజాద్ రాజు, చందన రాజు, స్వామి, నయీమ్, కొండలరావు, ధర్మ రెడ్డిపి.వీఎస్ కృష్ణారావు, రాన్బాక్సీ వనపర్తి సత్య నారాయణ, ఈగల్ టీం సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య మోహన్ రావు, బి.నరేష్ కుమార్ ఎస్సై, మధు హెడ్ కానిస్టేబుల్, అశోక్, నాయుడు, రాజు, వెంకటేష్, వాసు, వీరబాబు,కలిసి దేవ కాంచన, కదంబ, ఉసిరి, వెదురు, నేరేడు, మారేడు తదితర 42 మొక్కలను ఈరోజు ఒక ప్రక్క వాన పడుతుండగానే నాటడం జరిగింది. ఉదయం 6:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం 9:30 వరకు నిర్విఘ్నంగా జరిగింది. రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ భారీ ఎత్తు కార్యక్రమంలో 78 మంది ఆదిత్య వాలంటీర్లు పాల్గొనటం విశేషం.ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ లక్ష్మీ సరోజ మాట్లాడుతూ ఎఫ్. ఎస్. ఎస్.మరియు ఆదిత్య సంయుక్తంగా కలిసి అనేక కార్యక్రమాలు చేస్తారని, ఈ రెండు సంస్థలది విడదీయలేని బంధమని చెబుతూ తమ ఎన్ఎస్ఎస్ మరియు యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లు వర్షం సైతం లెక్కచేయకుండా పలువురికి స్ఫూర్తినిస్తూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారనీ, మొక్కలు నాటితేనే కాలుష్యం నివారణ అవుతుందని వాతావరణాన్ని చల్లబరుస్తుందని ఆమె తెలిపారు. ఎఫ్. ఎస్. ఎస్. కె.సుధాకర్ పట్నాయక్ మాట్లాడుతూ రాజమహేం ద్రవరాన్ని ఉష్ణం నుండి చల్లబరచి కాపాడాలనే మా ప్రయత్నం ఇలాగే కొనసాగుతుందని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎస్. కె.ఆర్ విశ్రాంత ఆంగ్ల ఉపన్యాసకురాలు శ్రీమతి అనురాధ సూర్యకుమారి ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు మరియు యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్స్ డాక్టర్ జి వి ఎస్ నాగేశ్వరరావు మరియు డాక్టర్ బి హెచ్ వి రమాదేవి, ఎన్ఎస్ఎస్పిఓ లు బి.విమల,పోలు కొండ సాయి,అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్ కిరణ్ కుమార్ తదితరులు సహకరించారు. వాలంటీర్ల నాయకత్వ వహించిన వంశి జగదీష్ మనోజ్ గౌతం జాహ్నవి నమ్రత సౌమ్య మహిమ కృష్ణకాంత్ గోపి తదితరులు జూనియర్ వాలంటీర్లతో కలిసి ఉత్సాహంగా 9:30 వరకు పని చేశారు. 9:45కు కార్యక్రమం ముగిసింది.

# రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు

### ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలోని శ్రీ వత్స కన్వెన్షన్ హాల్‌లో వైవిఎన్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి ఓపెన్ తైక్వాండో, కరాటే, కుంగ్ ఫు ఛాంపి యన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారం భమయ్యాయి. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ ఎంతో ఉపయోగపడతాయని, కరాటే, తైక్వాండో, కుంగ్ ఫు వంటి విద్యలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ధైర్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు. మండపేటలో రాష్ట్ర స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలను నిర్వహించడం వైవిఎన్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీకి అభినందనీయమని పేర్కొన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ,పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, కోచ్‌లు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు యధావిధిగా పీజీఆర్ఎస్-రెవెన్యూ క్లినిక్

### ప్రజల అభిప్రాయాల కోసం ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ : జిల్లా కలెక్టర్ కే.దినేష్ కుమార్



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటన లో తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్-రెవెన్యూ క్లినిక్లో భాగంగా జూలై 27న కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పీజీఆర్ఎస్-మీకోసం ద్వారా సేవలు పొందిన ఫిర్యాదుదారులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను నేరుగా ప్రభుత్వానికి తెలియ జేయవచ్చన్నారు. ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. జిల్లా పీజీఆర్ఎస్ నోడల్ అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని తహసీల్దార్, ఎంపీడీవో లు, ఐటీడీఏ పీజీఆర్ఎస్ హాల్‌లో జిలా కలెక్టరేట్ లో అర్జీలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే 1100 టోల్ ఫ్రీ నంబర్, meekosam.ap.gov.in ద్వారా ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 300కు పైగా పౌర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, గ్రీవెన్స్ కేంద్రాల్లో ప్రదర్శించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ప్రతి ఫిర్యాదుదారు తమ విలువైన ఫీడ్‌బ్యాక్‌ను నమోదు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### ఏపీ బీజేపీ చీఫ్ పి.వి.ఎన్. మాధవ్

# పోలవరం జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

### కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు )



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ ఈనెల 28 మంగళవారం పోలవరం జిల్లా రంపచోడవరం నియోజవర్గంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, మునుపెన్నడూ లేని విధంగా భారీ ఎత్తున విజయవంతం చేయాలని గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి,బిజెపి దేవీపట్నం మండలం ఇంచార్జ్ కారం సీతారామన్న దొర (ఢిల్లీబాబు) పార్టీ శ్రేణులకు, నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామంలో దేవీపట్నం మండల బిజెపి అధ్యక్షుడు కారం రామన్న దొర అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి, దేవీపట్నం మండల ఇన్చార్జి కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు) మాట్లాడుతూ ఈ పర్యటనలో భాగంగా రాష్ట్ర అధ్యక్షుడు పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు మరియు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై స్థానిక ప్రజలతో, పార్టీ ముఖ్య నేతలతో సుదీర్ఘంగా చర్చించనున్నారు., అనంతరం బిజెపి పోలవరం జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం ఉంటుందని సీతారామన్న దొర తెలిపారు. కేంద్రంలో నరేంద్ర మోదీ గారి నాయకత్వంలోని ప్రభుత్వం అందిస్తున్న నిధులు, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ పర్యటన ఒక మైలురాయిగా నిలవనుందని, కార్యకర్తలు అందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ పర్యటనను విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అయినాల వెంకటేశ్వరరావు, బిజెపి జనతా వారధి జిల్లా కన్వీనర్ కుండ్ల కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి పడమట లక్ష్మణరావు, బిజెపి యువ మోర్చ జిల్లా నాయకులు కుండ్ల సాయిరాం రెడ్డి, బిజెపి జిల్లా మీడియా సెల్ కన్వీనర్ బొంతు చక్రి, జిల్లా ఓబీసీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ వంగూరి చక్రవర్తి మూర్ల రమేష్, చిట్టిబాబు,వళ్ల రాంరెడ్డి, రావిపాటి గోవింద రావు, ముర్రం వెంకటలక్ష్మి, మండల ఎస్టి మోర్చా నాయకులు యలగాడ నాగేశ్వరావు, తుర్రం బాబురావు, మడి అప్పన్న దొర తదితరులు పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

